# “కళాభినందన’

అదేం మాయరోగమోగానీ నాకు చిన్నప్పటినుంచీ లలితకళలన్నీ ఓ యిదిగా నేర్చేసుకుని సకల కళాకోవిదుడు అనిపించుకోవాలని పాడుకోరిక. సంగీతం సరేసరి. వయోలిన్ పాఠాల్తో సరి... శిల్పం నేర్పేవాళ్లులేరు... డ్యాన్సు ఓ ఆర్నెల్లు వెలగబెట్టా. ఇక మిగిలింది చిత్రలేఖనం... అది ఖర్చు లేనిది... పైగా స్కూల్లో దీనికంటూ ఓ పీరియడ్... సో... అందువలన... ఇస్లియే బొమ్మలు గీకడం కాగితాలు ఖరాబు చేయడం షురూ... పైగా అప్పట్లో సంతనూ చిత్రకళాశాల మద్రాసు వారు పోస్టు ద్వారా బొమ్మలు గీయడం నేర్పేవారు (ఇప్పుడు కూడా వున్నట్టు డౌటు) సరే ఆ కోర్సు తెప్పించడం... ఇది అరవై దశకపు పూర్వార్థం మాట.

నా క్లాసుమేటుగా 'సెయింట్ జోసఫ్స్' నించి వచ్చిన ఇంగ్లీషు మీడియం విద్యార్థుల్లో మువ్వగోపాల్ ఒకడు. అతను పద్మభూషణ్ సంగీత కళానిధి. శ్రీపాద పినాకపాణిగారి అబ్బాయి. పులి కడుపున పులే పుట్టాలిగా... ఆ మహోత్కృష్ట కళాకారుడి పుత్రుడిగా జన్మించిన మువ్వగోపాల్ జన్మతః మంచి చిత్రకారుడు. గాయకుడు కూడా.

సరే స్కూల్లో డ్రాయింగ్ పోటీ...నేనూ గీకుతాను కాబట్టి నేనూ పోటీకి పేరిచ్చా. గంట వ్యవధిలో బొమ్మలు గీయాలి. గీచాం. ఫలితాలు వచ్చాయి.

హాశ్చర్యం! మనకు ఫస్ట్ ప్రైజు.

“రాట్ యిది అసాధ్యం వాడికెలా ఫస్ట్ వస్తుంది. వాడికి డ్రాయింగ్ రాదు. వాడు ట్రేసు ఎత్తాడు” అని మువ్వగోపాల్ గొడవ.

* * *

సరే ఈ జీవితంలో లలితకళలు కలలుగానే మిగిలిపోతాయి. ఈ రికామీ గాడిని కళలన్నీ కలిసికట్టుగా వెలివేసాయి. కానీ వాటి పట్ల అనురక్తి మాత్రం చచ్చిపోలేదు.

ఇప్పుడు మువ్వగోపాల్ ఎమ్.డి. చేసి మా కర్నూలు హాస్పిటల్‌లోఅసోసియేట్ ప్రొఫెసర్‌గా వున్నాడు. అయితే వాడు మాత్రం చిత్రలేఖనాన్ని వదల్లేదు. తనకు దొరికిన తీరికను చిత్రకళకు అంకితం చేశాడు. సంగీతం సరేసరి. ఆ ఇంట్లో ప్రతీదీ నాదమయమే.

ఓరోజున మువ్వగోపాలింటికి వెళ్లాను. “భలే సమయానికొచ్చావురా పద” అని మేడమీద తన గదికి లాక్కెళ్లాడు.

అక్కడ అసంపూర్ణంగా వున్న మూడు క్యాన్వాసులూ... పెన్సిల్ స్కెచ్ మాత్రం వేస్తున్న ఓ క్యాన్వాసూ వున్నాయి. ఆ పెన్సిల్ స్కెచ్ కాన్వాసును చూపుతూ "నాన్నగారి పోట్రేట్ ఆయిల్స్‌తో చేస్తున్నారా" అన్నాడు.

మళ్లీ కొద్ది నెల్లకి కనిపించినప్పుడు "నాన్నగారి క్యాన్వాస్ పూర్తైంది. వచ్చి చూడరా" అన్నాడు. ఈ దరిద్ర జీవితంలో అటువంటి వాటికి కేటాయించడానికి మాత్రం సమయం దొరకదు. ఆ క్యాన్వాస్ చూట్టానికి వెళ్లలేదు. చూసీచూసీ 'యిక వీడు రాడు' అనుకొన్నాడేమో ఆ క్యాన్వాస్‌ని ఫొటో తీసి ఓ కాపీ పట్టుకువచ్చి ఓ రాత్రి పదిగంటల సమయంలో నాకు ఇచ్చాడు మువ్వగోపాల్.

**జీవకళ ఉట్టిపడుతూ శ్రీ శ్రీపాద పినాకపాణిగారి చిత్రం.**

* * *

మొన్నేమో కర్నూల్లో పినాకపాణిగారి 91వ జన్మదినం సందర్భంగా ఊళ్లో ప్రముఖులు పండగ చేసారు.

సంగీతంలో ఆ మహానుభావుడు చూడని ఎత్తులేదు. అందుకోని బిరుదులేదు.

వారిది శుద్ధ తంజావూరు బాణీ. వారి సతీమణి కీ.శే. బాలాంబగారు కూడా గొప్ప సంగీత విద్వాంసులు.

మా మువ్వగోపాలు నాన్నగారిగా ఆయనకిచ్చే గౌరవం కంటే... సంగీతజ్ఞుడిగా ఆయనకు ఇవ్వాల్సి గౌరవం హెచ్చుగా వుంటుంది.

"సరిగమలు చెరిగిపోసిన వాణి
శుద్ధ తంజావూరు బాణి
సిరిపాదుల పినాకపాణి"

మా కర్నూలు సంగీత పిపాసులు చేసుకున్న పాపమేమో తెలియదు. వారు ఇన్ని దశాబ్దాలుగా కర్నూల్లో వున్నా ఒక్కటంటే ఒక్కటి సంగీత కచేరీ ఇవ్వలేదు. వారి రికార్డులే మాకు ప్రాప్తం అనుకుంటాం.

పక్క పెయింటింగ్ మా మువ్వగోపాల్ వేసిందే.

* * *

***ఎన్నిసార్లు చెప్పినా మళ్లీమళ్లీ చెప్పవలసిన మాట. సంగీత సాహిత్యాది కళలు మనిషి మానసికారోగ్యానికి అత్యవసరం... అత్యవసరం.*** ●

*ఈ ప్రూఫు చూసేసమయానికి శ్రీ శ్రీపాద పినాకపాణి గారు కీర్తిశేషులయ్యారు*